విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 10, ఆగష్టు 2024

# రాయలసీమకు సాగు, తాగునీరు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి

**విశాలాంధ్ర - డోన్ :** రాయలసీమకు సాగు, తాగునీరు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డోన్ పట్టణంలోని సీపీఐ కార్యాలయం నక్కి రామన్న భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జన వనరుల శాఖ రూపొందించిన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో రాయలసీమలోని హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగా, కేసీ కెనాల్, నూతనంగా గుండ్రేవుల రిజర్వాయర్, వేదావతి, సిద్దేశ్వరం, అలుగునిర్మాణం కోసం ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోవడం ఘోరమన్నారు. కృష్ణా, గోదావరి నదుల ఉప్పొంగి ప్రవహిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించి ఆనందం వ్యక్తం చేయడం తప్ప, పోలవరం పూర్తి అయిన తరువాత ఆదా అయ్యే కృష్ణా జలాలను వినియోగించుకొనేందుకు ఏనాడో కట్టిన సుంకేసుల ప్రాజెక్టు, వెలుగోడు, అలగనూరు రిజర్వాయర్లు తప్ప కనీసం 40 టీఎంసీల నిల్వచేసుకునే రిజర్వాయర్లు లేకపోవడం చాలా దారుణమన్నారు. గత

ప్రభుత్వం మాదిరే బటన్ నొక్కి సంక్షేమ కార్యక్రమాలకే ప్రధాన ఇస్తే నిరంతరం కరువు, కాటకాలతో అల్లాడే రాయలసీమ రైతులు భూములకు సాగు, గ్రామంలో తాగునీరు అందించేందుకు అవసరమైన చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. బచావత్ ట్రిబ్యునల్‌లో రాయలసీమకు కేటాయించిన 33 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు గత అనేక ఏళ్లుగా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో నీటి కేటాయింపులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటి వివాదం ప్రారంభమైందని, ఈ వివాదం గురించి తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన విచారణపై ఆంధ్ర ప్రదేశ్ వైఖరి తెలియచేయడానికి బ్రిజేష్ కుమార్ ఇచ్చిన గడువు మరోవారం రోజుల్లో ముగియనుందన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలపై బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు కల్పించిన హక్కులను కాపాడి రాయలసీమకు కరువు నివారణ కోసం ఇప్పటికైనా ప్రయత్నించాలన్నారు. అందుకోసం గుండ్రేవుల, వేదవతి, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవాకు, కర్నూలు జిల్లాలో 106 చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ అధికారంలో వచ్చిన తర్వాత నంద్యాల జిల్లాలో అత్యాచారాలు, రౌడీయిజం పెరిగిపోయిందన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనంతో శాంతి భద్రతలు లోపించాయని, గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఈ ప్రభుత్వంలో మార్పు వస్తుందని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తక్షణమే శాంతి భద్రతలను కాపాడుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సుంకయ్య, రాధాకృష్ణ, డోన్ పట్టణ కార్యదర్శి బి.నారాయణ, మండల సహాయ కార్యదర్శులు వరదరాజులు, హుస్సేన్ పీరా తదతరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర - నంద్యాల :** ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్న చెంచు, సుగాలి, ఎరుకల, యానాది తదితర జాతుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపు నిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, ఎస్టీసెల్ అధికార ప్రతినిధి స్వామి నాయక్, రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు శ్రీనివాస్ నాయక్, దాసు నాయక్, ఎస్.రామచంద్రుడు, జవహర్ నాయక్, గోపాల్ నాయక్, చిటికెల సలోమి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజ కుమారి మాట్లాడుతూ చెంచు, సుగాలి, యానాది, ఎరుకల తదితర

జాతుల జీవన ప్రమాణాల పెంపుదలకు అందరం కలిసికట్టుగా ఉమ్మడి ప్రయత్నం చేయాలన్నారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ప్రతి ఏడాది ఆగష్టు 9న ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల దినోత్సవం జరుపుకోవాలని సూచించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, అన్ని కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎంపీటీసీలు టీడీపీలో చేరిక

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీలు సురేష్ బాబు, నాగేశ్వరరావులు గురువారం ఆ గ్రామ టీడీపీ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు మాజీ విద్యా కమిటీ చైర్మన్ రెడ్డిపోగు గిడ్డయ్య టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాజా బాష, జడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కట్టుబడి పుల్లన్న పాల్గొన్నారు.

## అడవి పంది దాడిలో మహిళా కూలీకి గాయాలు

**విశాలాంధ్ర - చాగలమర్రి :** అడవి పంది దాడిలో మహిళా కూలీ తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని చింతలచెరువులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహిళా వ్యవసాయ పేద కూలీ ప్రమీల వరి నాట్లు వేసేందుకు చింతలచెరువు నుండి మూడురాళ్ళపల్లెకు వెళ్ళే రస్తాలోని ఓ రైతు పొలంలో కూలీకి వెళ్ళింది. ఒక్కసారిగా అడవి పంది దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయమైంది. తీవ్రంగా గాయపడ్డ మహిళా కూలీని సహచర కూలీలు చాగలమర్రి పట్టణంలోని కేరళ వైద్యశాలకు తరలించారు.

## సుందరావు మృతి పట్ల సంతాపం

**విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్:** వైసీపీ నాయకులు 4వ వార్డు కౌన్సిలర్ సుగుణమ్మ భర్త సుందరరావు అనారోగ్యంతో శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ సుందరరావు భౌతికాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈయన వెంట మున్సిపల్ కౌన్సలర్లు ముర్తుజ, షఫీవుల్ల, రంగస్వామి, ప్రకాష్, నాయకులు మొమిన్ మునీర్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి కేసు నమోదు

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల:** మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన ఓబులేసుపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన రవితేజ, ఓబులేసుకు మధ్య మనస్పర్ధలు ఉండేవి. గురువారం రాత్రి రవితేజ, విజయ్ అతని తండ్రితో కలిసి ముగ్గురు కలిసి ఓబులేష్ ఇంటి వద్దకు వచ్చివాదనకు దిగి ఓబులేష్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

## ప్రజా సమస్యలపై కనపడని చర్చ

- సభ దృష్టికి సమస్యలను తీసుకురాని సభ్యులు
- తూతూ మంత్రంగా మండల సమావేశం

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** మండల ప్రజల సమస్యలు, అభివృద్ధిపై చర్చించాల్సిన సమావేశాన్ని తూతూ మంత్రంగా

ముగిం చేశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు ఎవరు సభ దృష్టికే తీసుకురాలేదు. తమకు సంబంధం లేనట్టు మిన్నకుండి పోవడంతో అధికారులు హడావుడిగా తమ శాఖకు సంబంధించిన వివరాలను చదివి, వెళ్లిపోయారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన, ఇంచార్జీ ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా ప్రభుత్వ శాఖ అధికారులు హాజరయ్యారు. సభ్యులు ఎవరు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురాలేదు. ఆయా శాఖ అధికారులు తమ శాఖ చేపట్టే పనులు, ప్రగతిని సభలో చదివి వినిపించేటప్పుడు ఒకరిద్దరు సభ్యులు మాత్రం వివరణ అడిగారు. సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చిన ఎటు పరిష్కరించలేరన్నట్లు సభ్యులు వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు సభను ప్రారంభించి 12:30 గంటలకే ముగింపు చేశారు. చర్చలు లేకపోవడంతో తూతూ మంత్రంగా మండల సమావేశం జరిగింది. సమావేశంలో ఇంచార్జీ తహసీల్దార్ నాగేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, ఏపీవో గంగన్న, ఆర్డబ్ల్యూఎస్ సుబ్రహ్మణ్యం, పులి ప్రకాష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సర్పంచులు లాయర్ మహేష్ రెడ్డి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, గురువిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌డీఆర్ స్కూల్‌ను సీజ్ చేయాలి : ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర - నంద్యాల అర్బన్:** విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్‌డీఆర్ పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఈవో లేకపోవడంతో కార్యాలయ తలుపుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ గత వారం రోజుల కిందట ఎస్‌డీఆర్ పాఠశాల చైర్మన్ కొండారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటన పైన సమగ్ర విచారణ జరిపించాలని గతవారం రోజులుగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు, వినతి పత్రాలు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫుడ్ పాయిజన్ ఘటన కారణమైన పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినట్లు ఆయన తెలి

పారు. ఎస్‌డీఆర్ స్కూల్ యాజమాన్యం ఏసీ క్యాంపస్ అని కల్లబొల్లి మాటలు చెప్పి విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను అడ్మిషన్ చేయించుకొని లక్షలకు లక్షల రూపాయలు ఫీజుల దోపిడీ చేస్తున్నారని, అనుమతులు లేకుండా హాస్టల్ క్యాంపస్ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్ క్యాంపస్ ను పరిశుభ్రంగా ఉంచకుండా అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్నారని, హాస్టల్ నిర్వహణ చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని వారన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిన నేపథ్యంలో విసిటింగ్ కు వెళ్ళినటువంటి ఆర్డిఓ, ఎంఈఓ, ఇతర అధికారులను లోపలికి అనుమతించడానికి నిరాకరించారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా డీఈవో కార్యాలయ వేదికగా ఎస్‌డీఆర్ స్కూల్లో జరిగిన ఫుడ్ ఫాయిజాన్ ఘటన పైన, అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహణ అంశం పైన, ఫీజుల దోపిడీ పైన ఎస్ డి ఆర్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, స్కూల్‌ను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కి, విద్యా శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని, స్కూల్‌పైన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవి,విష్ణు, నాయకులు అంజి, చంద్ర, శేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సోదరి టీడీపీలో చేరిక

**విశాలాంధ్ర - నందికొట్కూరు :** వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ సోదరి పాములపాడు మండల ఎంపీపీ తొగూరు వర్షిణమ్మ మండల కన్వీనర్ రవీంద్ర రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో శు

క్రవారం నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ మాండ్ర శివానంద రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. అల్లూరు గ్రామంలో మాండ్ర స్వగృహం నందు ఆమెకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ సైతం టీడీపీలో రావడంతో మండలంలో వైసీపీకి చెక్ పెట్టినట్లైంది. గతంలోనే ఇక్కడి జడ్పీటీసీ, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, గోవిందు, కృష్ణ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవో రద్దుపై మత్స్యకారుల హర్షం

**విశాలాంధ్ర - వెలుగోడు :** మత్స్యకారుల ఆదాయానికి గండి కొట్టే జీవో నెంబర్ 217ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేయడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వెలుగోడు

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 217 జీవో వల్ల తమకు వచ్చే ఆదాయంలో మత్స్యశాఖ 30 శాతం, ఇరిగేషన్ శాఖకు 15 శాతం, గ్రామపంచాయతీకి 10 శాతం, ప్రభు త్వానికి 15 శాతం చెల్లించగా, మిగిలిన కొద్ది శాతం ఆదాయంతో తాము నష్టపోవడం జరిగిందన్నారు. మండల అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖలీల్ ఖాన్, టీడీపీ నాయకులు హీదాయత్ అలిఖాన్ పాల్గొన్నారు.

# అబ్బిపురం ఆదివాసులను ఆదుకోండి : సీపీఐ

**విశాలాంధ్ర - మహానంది :** ఆదివాసి దినోత్సవం పేరుతో ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు తప్ప ఆదివాసుల పడుతున్న ఇబ్బందులను అవస్థలను పట్టించుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మహానంది మండలం అబ్బి పురం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల గిరిజనుల గుడిసెలు కూలిపోవడంతో శుక్రవారం సీపీఐ జిల్లా ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎస్.బాబా ఫక్రు ద్దీన్ మాట్లాడుతూ మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో 42 కుటుంబాల గిరిజనులు దుర్భరమైన జీవి తాలతో గడుపుతున్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. గ్రామానికి రోడ్డు నిర్మాణం, వీధి లైట్లు, మరుగుదొడ్లు, గృహ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులకు అధికార పార్టీ నాయకులు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. జిల్లా ఐటీడీఏ అధికారులు అబ్బి పురం గ్రామాన్ని ఇంతవరకు సందర్శించకపోవడం విచారకరమని, గ్రామంలో మగవారు అడవికిపోక పోవడం వల్ల అర్థాకలితో జీవిస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటా రాముడు, సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు, గిరిజన సమాఖ్య జిల్లా నాయకుడు తుపాకుల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు లక్ష్మయ్య, అంజి, పాల్గొన్నారు.

## ప్రసన్న బాధ్యత ప్రభుత్వానిదే : జిల్లా కలెక్టర్

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మిద్దెకూలి మృతి చెందిన బాధితురాలు ప్రసన్న బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం చిన్నవంగలి గ్రామంలో మిద్దెకూలి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితురాలు ప్రసన్నకు తామంతా కుటుంబ సభ్యులుగా, అండగా ఉండి, ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ప్రసన్నకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని వైద్యశాలలో పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రసన్నకు తానున్నాని, అధైర్య పడొద్దని అక్కున చేర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌళిబాష, ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు విజయ్‌కుమార్, హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు, ఎంఈవో అనురాధ, ఇంచార్జీ ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఈఓఆర్డీ తాహీర్‌హుసేన్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షఫివుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపీఓ నిర్మల, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆళ్ళగడ్డ జూనియర్ సివిల్ జడ్జీ ఈశ్వర వెంకట ప్రసాద్ కోరారు. మండలంలోని ఒంట

గుడిసె తాండాలో న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వైద్యులు శబరీష్, జనరల్ మెడిసిన్, తస్లీమా సుల్తానాలు గిరిజనులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేసారు. సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఎస్ఐ రమణయ్య, వీపీ సోమశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, ప్యానెల్ లాయర్ షాహినాభేగం, గౌస్, ఆరోగ్య విస్తరణ అధికారులు, పాల్గొన్నారు.

## :// సంక్షిప్త సమాచారం //:

### నేడు అవుకు రానున్న మంత్రి బీసీ..

**విశాలాంధ్ర-అవుకు:** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం అవుకు పట్టణానికి రానున్నారని ఎస్సార్బీసీ ఎస్ఈ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరుకల్లు నుండి జీఎన్ఎస్ఎస్ కాలువ, ఎస్సార్బీసీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో అవుకు జలాశయం వద్ద నిర్వహించే జలహారతి కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొననున్నారని అన్నారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ, ఎస్సార్బీసీ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీరు జలాశయంలోనికి వచ్చి చేరుతుందని, ఈ నెల 10 నాటికి జలాశయంలో 3.5 టీఎంసీల నీటి సామర్థ్యానికి చేరుకుంటుందన్నారు. జలాశయ పూర్తిస్థాయి సామర్థ్యం 4.16 టీఎంసీలని తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా జలాశయం వద్ద చేస్తున్న జలహారతి ఏర్పాట్లను ఈఈ సురేష్‌బాబుతో కలిసి పరిశీలించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**విశాలాంధ్ర - ఉయ్యాలవాడ:** మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నందు మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో సరఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలని కోరారు.

### ఇద్దరు ఎస్ఐలు బదిలీ..

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల:** స్థానిక సర్కిల్ పరిధిలోని కోవెలకుంట్ల, రేవనూరు పోలీస్ స్టేషన్‌లలో పనిచేసే ఎస్సైలు వరప్రసాద్, ఎస్సై రామ్మోహన్ రెడ్డి బదిలీ అయ్యారు. కోవెలకుంట్ల ఎస్సై వరప్రసాద్ గడివేముల పోలీస్ స్టేషన్‌కు రేవనూరు ఎస్సై రామ్మోహన్ రెడ్డి వెలుగోడు పోలీస్ స్టేషన్ బదిలీ అయ్యారు. కోయిలకుంట్ల రేవనూరు పోలీస్ స్టేషన్లకు ఎస్సైలను ఇంకా నియమించలేదు.

### వెండి దీపాలు బహుకరణ..

**విశాలాంధ్ర - మహానంది :** మహానంది గ్రామానికి చెందిన భవనాసి ఎల్లయ్య, సుధామణి వారి బంధుమిత్రుల సహాయ, సహకారంతో మహానంది పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీ కోదండ రాములవారికి రెండు వెండి దీపాలను శుక్రవారం దేవస్థానం ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డికి వెండి దీపాలను భవనాశి సోమశేఖర్, వైష్ణవి దంపతులు అందజేశారు. వాటి తూకం 871 గ్రాములు 200 మిల్లీ గ్రాములు. ఏఈవో మధు, శశిధర్ రెడ్డి, పూజారి మణికంఠ పాల్గొన్నారు.

### వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో..

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని చిన్నవంగలి గ్రామంలో గల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లను, గదులను, ఆర్వో ప్లాంటును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గదుల, ఆర్వో ప్లాంటు మరమ్మతులు తదితర సమస్యలు ఉన్నాయని వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని వార్డెన్ ఖాశీంసాను హెచ్చరించారు. ఎంఈవో అనురాధ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఈఓఆర్‌డి తాహీర్‌హుసేన్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండీ ఫిరోజ్..

**విశాలాంధ్ర - నంద్యాల :** ప్రముఖ సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా జిల్లా మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు ఈపూరి రాజశేఖర్, నంద్యాల అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండు గ్రామాలను దత్తత తీసుకొని ఎంతో అభివృద్ధి చేశారని, ఎంతో మంది చిన్నారులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆపరేషన్లు చేయించిన గొప్ప మనిషి మహేష్ బాబు అని తెలిపారు. మహేష్ బాబు మరెన్నో మంచి సేవ కార్యక్రమాలు చేస్తూ, వారి అభిమానులు ప్రజల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫిరోజ్ చేతుల మీదుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత..

**విశాలాంధ్ర - వెలుగోడు :** చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ ఓవర్సీస్ లెదర్ ఫ్యాక్టరీ అధినేత, పాఠశాల పూర్వ విద్యార్థి మద్దెల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు వెలుగోడు పట్టణ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గార్డెన్‌లో ఆయన మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ తమ జీవితకాలంలో కనీసం ఐదు మొక్కలను అయినా నాటి వాటిని పరిరక్షించినట్టయితే పర్యావరణాన్ని కాపాడిన వారముఅవుతామన్నారు. పచ్చని చెట్లు మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడమే కాక వర్షాలు కురవడానికి ప్రముఖ పాత్ర వహిస్తాయి అన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, సంఘం కార్యనిర్వాహక సభ్యులు జయరామిరెడ్డి, సుల్తాన్ మొహిద్దీన్, నసురుల్లా ఖాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తీర్చాలి..

**విశాలాంధ్ర -వెలుగోడు :** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అఖిలభారత రైతుకూలీ సంఘస్త ఆధ్వర్యంలో వెలుగోడు చెంచు కాలనీలో జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ అధ్యక్షతన సభ నిర్వహించడం జరిగింది. ఈ సభను ఉద్దేశించి అఖిలభారతా రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.నరసింహులు మాట్లాడుతూ ఆదివాసి చెంచు గిరిజన ప్రాంతాల్లో నేటికీ మౌలిక సదుపాయాలు, రోడ్లు విద్య, వైద్య సదుపాయాలు సక్రమంగా అందడం లేదన్నారు. అనారోగ్యాల వలన ఆదివాసులు సగటు జీవితం 45 ఏళ్ల కంటే ఎక్కువ జీవించడం లేదని, ఆదివాసి చెంచు గిరిజనులు సాగు చేసుకుంటున్న పొడు భూమికి పట్టాలు ఇవ్వాలన్నారు. వేంపెంట దగ్గర చెంచులకు ఇచ్చిన భూములను ఆన్లైన్లో ఎక్కించాలన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

# రౌడీ షీటర్‌కు పాఠశాల చైర్మన్ పదవా..?

**విశాలాంధ్ర - రుద్రవరం:** తల్లిదండ్రులు భక్తి భావంతో, తమ పిల్లలు ఆయురారోగ్యాలతో పాటు విద్యలో ఉన్నతంగా రాణించాలంటూ గుడికి వెళ్లి తాము నమ్మిన భగవంతునికి మొక్కులు తీర్చుకుంటారు. తమ పిల్లలకు విద్యతో పాటు మంచి నడవడికను గురువులు నేర్పిస్తారని గుడిలాంటి బడికి పంపిస్తే, ఆ బడి అభివృద్ధిని చేసేందుకు ఒక రౌడీ షీటర్‌ను పాఠశాల చైర్మన్‌గా ఎన్నుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బి.నాగిరెడ్డి పల్లె గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు గురువారం పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ పదవి కోసం అదే గ్రామానికి చెందిన శ్రీరాములు జూన్ 02, 2020లో రౌడీ షీటర్‌గా పోలీసులు రికార్డుల్లో నమోదు చేశారు. రౌడీ షీటర్‌గా పేరొందిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టారు. పాఠశాల అభివృద్ధితోపాటు పిల్లలను మంచి మార్గంలో నడిచేందుకు దోహదపడే చైర్మన్ రౌడీ షీటర్ అయితే

పాఠశాల అభివృద్ధి దేవుడెరుగు.. ఆ పాఠశాలల్లో చదివే పిల్లల పరిస్థితి ఏంటంటూ గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదే విషయంపై ఎంఈఓ లక్ష్మిని వివరణ కోరగా ఆ గ్రామంలో బడికి వచ్చే పిల్లల తల్లిదండ్రులు రౌడీషీటర్లు ఎవరో, మంచివారు ఎవరో మాకు ఎలా తెలుస్తోంది. పోలీసుల రికార్డుల్లో రౌడీ షీటర్‌గా కేసు నమోదై ఉంటే అలాంటివారు చైర్మన్ పదవికి అనర్హులు. విచారించి ఉన్నతాధి కారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.

# దేశంలోనే నం.1 క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్

**విశాలాంధ్ర - నంద్యాల :** దేశంలోనే నెం.1 క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్ అని నేషనల్ మీడియా చెప్తోందని, సబీఐ కోర్టుకు వెళ్లకుండా ఉండేందుకే ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమాన్ని జగన్ ఏర్పాటు చేసుకుంటున్నాడని రాష్ట్ర మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు విమర్శించారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జగన్‌పై విరుచుకుపడ్డారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలకు, హత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు క్లియర్‌గా చెప్పా రన్నారు. జగన్ ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకొవాలని, రాష్ట్ర అభివృద్ధి

గురించి మాట్లాడితే బాగుంటుందని మంత్రి ఫరూక్ హితవు చెప్పారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. జగన్ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలన్నారు. సీతారామాపురంలో రెండు పార్టీల మధ్య గొడవ జరగలేదని, రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగిందన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ వల్లే మర్డర్ జరిగిందన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదని అఖిలప్రియ ప్రశ్నించారు. నంద్యాల శిల్పా వెంచర్‌లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేస్తే జగన్ ఎందుకు స్పందించలేదన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. మాటకు రెడ్ బుక్ ఒకటే కనిపిస్తోందని, ఇంకా రెడ్ బుక్ తెరవలేదని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 10, ఆగస్టు 2024



# కార్పొరేట్ సంస్థలను దేశం నుండి తరిమి కొట్టండి - రైతు కార్మిక సంఘాలు

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు :** దేశప్రజలను దోచుకుంటున్న కార్పొరేట్ సంస్థలను దేశం నుండి తరిమికొట్టాలని రైతు,కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారంక్విట్ ఇండియా దినోత్సవంలో భాగంగా దేశ వ్యాప్తంగా క్విట్ కార్పొరేట్ సేవ్ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు నిచ్చింది. పిలుపులో భాగంగా రైతుసంఘాలు, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకత్వంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డిఅంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిమునెప్ప, వ్యవసాయ కార్మికుల జిల్లా కార్యదర్శి నారాయణ, రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు ఇంగ్లాండ్ వారు భారతదేశాన్ని డైరెక్ట్ గా దోపిడీ చేస్తే నేడు కార్పొరేట్ సంస్థలు దేశ ప్రజల సొమ్మును మొత్తాన్ని ఇన్‌డైరెక్ట్‌గా దోచేస్తున్నాయని విమర్శించారు . మొత్తం వ్యవసాయరంగంలో కార్పోరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిపోయిందన్నారు. విత్తనాలు, ఎరువులు,ఫెస్టిసైడ్స్ అన్నీ కూడా కార్పొరేట్‌సంస్థల గుత్తాధిపత్యంలో ఉన్నాయని తెలిపారు. భారతదేశంలో యూరియా43% డిఎపి 54% పొటాషియం 57% మాత్రమే ఉత్పత్తి అవుతుందని మిగిలినదంతా విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అన్ని దేశాల కంటే భారతదేశం విత్తనశుద్ధికి అనుకూలమైన ప్రాంతంగా ఉందని ప్రపంచంలో ఉండే విత్తనశుద్ధి కంపెనీలన్నీ భారత దేశంపై మోహరించాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు న్యూసిటీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్,విజయ్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, రైతుకూలీసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సుంకన్న, నాయకులు నాగరాజు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు,ఆటో యూనియన్ నాయకులు మహమూద్,కుమార్ మహిళా సంఘం నాయకులు రజియా , రేణుక, సురేంద్ర, రైతు, కార్మిక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులను బహిష్కరిద్దాం-పి.రామచంద్రయ్య

**విశాలాంధ్ర-పత్తికొండ:** కార్పొరేట్ శక్తులనుబహిష్కరించి, వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య పేర్కొన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఏపీ రైతుసంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ మోడీపాలనలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందని, రైతుల ఆత్మహత్యలు నివారించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతి రైతుకు రూ.10 వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టినబడ్జెట్ కార్పొరేట్‌శక్తులకు అనుకూలంగా ఉందని, వ్యవసాయ రంగానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా పూర్తిగా విస్మరించడం జరిగిందన్నారు. కార్మిక చట్టాలను, హక్కులను సైతం మోడీ కాల రాస్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు పూనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లను తరిమికొట్టి బడా కంపెనీల నుండి ప్రభుత్వ రంగాన్ని, వ్యవసాయాన్ని కాపాడుకుందాం అన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఈకార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు కారన్న, డిహెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టి కంటయ్య, రంగన్న, నాయకులు గిడ్డయ్య గౌడ్, మద్దిలేటి, నాగిరెడ్డి, పులికొండ, జయమ్మ, సుంకమ్మ, రంగమ్మ, లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

## ఘనంగా సీపీఐ మహాసభలు

**విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్:** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నాలుగో మహాసభలు ఓర్వకల్లు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల్లోనూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ సీపీఐ ఓర్వకల్లు మండల కార్యదర్శిగా ఆవుల రమేష్. మండల కార్యదర్శి మండల సహాయ కార్యదర్శిగా..రైతు సంఘం మండల కార్యదర్శి పెద్దింటి సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.మహబూబ్ బాష, రైతుసంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యవర్గసభ్యులు చిన్నసుంకన్న,అఖిల్, మహబూబ్‌వలి, మహమ్మద్ మియా, రమేష్, చిన్న, తదితరులను కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## మహిళల మరుగుదొడ్లకు మర్మత్తులు చేయాలి

### సీపీఐ ఆధ్వర్యంలో కమిషనర్‌కి వినతి

**విశాలాంధ్ర-ఎమ్మిగనూరు:** స్థానిక సున్నం బట్టీ సమీపం లోని మహిళల పబ్లిక్ మరుగుదొడ్డికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా సమీపంలోని కాలనీవాసులు అక్కడి నుండి వెదజల్లుతున్న దుర్వాసనతో వారి ముక్కుపుటాలు అదురుతున్నాయనీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు పన్నులు వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యలపై లేదా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే ఆ ప్రాంత ప్రజల హాస్పిటల్ పాలవుతున్న గత 5 రోజుల క్రితం సిపిఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి ఆ మహిళ మరుగుదొడ్డి మనం డ్రైనేజ్ పైప్ ను ఏర్పాటు చేయకపోతే కాలనీ ప్రజలతో పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామాంజనేయులు,కాజా సుంకన్న,నరసింహులు,రవి, తదితరులు పాల్గొన్నారు.

# నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం-మంత్రి టి.జి.భరత్

**విశాలాంధ్ర-కర్నూలు సిటీ:** కర్నూలునగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్యశాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శుక్రవారం 51వ వార్డు ఈసిఎం కాంపౌండ్ నందు రూ.50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి మంత్రితో పాటు నగర మేయర్ బి.వై. రామయ్య, కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఇంటింటికీ తిరిగినప్పుడు, ప్రజల నుంచి అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వాటన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకే పెద్దపీట వేస్తున్నామని, ప్రజల పరస్పర సహకారంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు. పాతబస్తీలో విద్యుత్‌తీగలు వేలాడుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు.కార్యక్రమంలో ఎంఈ షాకీర్, డిఈ గిరిరాజు, ఆరోగ్యాధికారి విశ్వేశ్వర రెడ్డి, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో కార్పోరేట్లను తరిమి కొడదాం-ఎయికేఎస్,ఏఐటీయూసీ

**విశాలాంధ్ర-ఎమ్మిగనూరు:** క్విట్‌ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బడా కార్పొరేట్ల కబంధస్థల్లో బంధించబడిన వ్యవసాయ, కార్మికరంగాలను కాపాడాలని కోరుతూ ఎయికేఎస్, ఏఐటీయూసీ జాతీయసమితి పిలుపుమేరకు ఎమ్మిగనూరులోని ఎంపీడీవో కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపనగౌడ్, జిల్లాకోశాధికారి బీటీ చిన్నాన్న, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్,తిమ్మ గురుడు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఆత్మహత్యలు లేకుండా చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం పంటలకు మద్దతు ధరలు కల్పిస్తామని ఎన్నికల బహిరంగ సభలలో స్వయంగా చెప్పారని అధికారంలోకి వచ్చాక ఆహామీలు అమలు పరచకపోగా మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చారని.ఆచట్టాలు అమలు అయితే రైతులకు ఇప్పటివరకు ఉన్న కనీస మద్దతు ధరల చట్టం పోతుందని, మార్కెట్ సంస్థల కొనుగోలు కూడా లేకుండా పోతాయని, రైతులు తమ భూములలోనే కంపెనీలకు కూలీలుగా మారిపోతారని గ్రహించి రైతాంగం 13 మాసాలు అనేక నిర్బంధాలను ఎదుర్కొని శాంతియుతంగా పోరాటాల నిర్వహించి ఆ చట్టాలను రద్దు చేయించుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ సంస్థలను అదాని అంబానీలకు అప్పగించడానికి వీలుగా చట్టాన్ని సవరణ చేసేసారు. కార్మిక చట్టాలు నిర్వీర్యం చేస్తూ కార్మికులతో వ్యక్తి చాక్లెట్ చేయించడానికి నాలుగు లేబర్ కోర్టులను అమలు చేస్తున్నారని..కార్మికుల శ్రమ దోపిడి గురవు తున్నారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీయుల్లా, సీపీఐ సీనియర్ నాయకులు భాస్కర్‌యాదవ్, రైతు సంఘం జిల్లా నాయకులు కేసి.జబ్బార్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు శాంతప్ప, మాలిక్, ప్రజా సంఘాల నాయకులు రంగస్వామి,విజయేంద్ర, కాజా, రామాంజనేయులు, దాదావలి, మల్లికార్జునగౌడ్, ఇస్మాయిల్, రైమాన్, రాము, హనుమంతు,జైరామ్, యోహాన,ఇస్మాయిల్, అజార్,రవి,షరీఫ్, నరసింహులు, సుంకన్న, జాంగిర్,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ :** ఏపీఐఐసీ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు ఇండస్ట్రీల్ హబ్ పరిశీలనకు విచ్చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జి భరత్,ఎమ్మెల్యే గౌరు చరితలకు సీపీఐ నాయులు వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ రమేష్. రైతు సంఘం మండల కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ఏపీఐఐసీలో భూములు కోల్పోయినా రైతులకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని, చెక్కులు వచ్చిన కూడా ఆ మాట ఈ మాట ఆ సర్వే ఈ సర్వే అంటూ కాలయాపన చేస్తున్నాం న్నారు. వెంటనే నష్టపరిహారం చెక్కులు ఇవ్వాలని మరియు పరిశ్రమల్లో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు 75% ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అందేలా స్థానిక పరిశ్రమల్లో ఓపెన్ బ్లాస్టింగ్‌లతో ఇల్లు చీలికలు రావడం జరిగింది. వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు అఖిల్,వలి, సుమన్, చిన్నసుంకన్న,మహమ్మద్ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దస్తగిరి

**విశాలాంధ్ర-సి.బెళగల్ :** మండల పరిధిలోని సంఘాల సమీపంలో తుంగభద్రానది ఒడ్డునున్న చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. శుక్రవారం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే తుంగభద్రా నదిలో జలహారతి ఇచ్చి పూజలు నిర్వహించి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం ద్వారా చింతమాను పల్లె, సోమల గూడూరు, బెళగల్ తదితర గ్రామాల పంట పొలాల్లోని 1826 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎత్తిపోతల పథకం కాలువ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ బి వెంకటేష్ మరియు కమిటీ సభ్యులు,పోలకల్ తిమ్మప్ప, అమర్నాథ్,నల్లన్న, ధనుంజయ,డీఈ లక్షణ కుమార్, ఏఈ మణికంత, వర్క్ఇన్స్పెక్టర్ అర్జున్ ఆయా గ్రామాల సర్పంచులు మరియు ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల శారీరక,మానసిక దృఢత్వానికి ఆటలు అవసరం

**విశాలాంధ్ర-మద్దికెర:** విద్యార్థులశారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని మండల విద్యా శాఖాధికారి రంగస్వామి అన్నారు.శుక్రవారం ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గూడూర్ ధనుంజయుడు యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం చదువులోనే నిమగ్నమై ఉండడంతో మానసికంగా తీవ్ర ఇబ్బందులు, ఒత్తిడికి గురవుతుం టారని, ఈ మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు.అంతేకాకుండా విద్యార్థుల్లో ఉండే ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కబడ్డీ పోటీలు ఉపయోగపడతాయని, కబడ్డీ పోటీలు నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ నాయకులను అభినందిస్తున్నానని ఇలాంటివి భవిష్యత్తులో మరిన్ని నిర్వహించేలా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పిహెచ్ఎస్ కెవిఆర్ బాయ్స్ స్కూల్ హెడ్ మాస్టర్ బాబు, సీపీఐ పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, మండల కార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మండల నాయకులు జస్వంత్, వేణు, అనిల్, జగన్, రంగా, ప్రతాప్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## మునికోటి ప్రాణ త్యాగం మరువలేనిది

**విశాలాంధ్ర-జిల్లా పరిషత్:** రాష్ట్రానికి ప్రత్యేక హోదాకై మునికోటి ప్రాణ త్యాగం మరువలేనిదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుబాబురావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మునికోటి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నాడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఆత్మార్పణ చేశారని చాలామంది త్యాగాలు చేశామని చెప్పుకోవచ్చు కానీ, ప్రాణ త్యాగం చేయడం గొప్ప అని మునికోటి త్యాగం మరువలేనిదని కొనియాడారు.కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్‌లు పాల్గొన్నారు.

# క్రిష్ణా జలాశయం నుండి సాగర్‌కు నీరు విడుదల

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు :** క్రిష్ణా జలాశయం నుండి దిగువ నాగార్జునసాగర్‌కు నీటి విడుదల కొనసాగుతుంది. క్రిష్ణా పరివాహన ప్రాంతంలో వరదలు కొనసాగుతుండటంతో శ్రీశైల జలాశయానికి భారీగా నీరు వచ్చి చేరుతుంది. దీంతో జలాశయం నుండి దిగు వ సాగర్‌కు 10 స్పిల్‌వే గేట్లు 14 అడుగుల మేరా ఎత్తి దిగువ సాగర్‌కు 3,50,110 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయానికి జూరాల స్పిల్‌వే నుండి 2,67,696 క్యూసెక్కులు, పవర్ ప్రాజెక్టు ద్వారా 20,428 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 40,311 క్యూసెక్కులు, మొత్తం 3,92,415 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం నుండి పోతిరెడ్డిపాడుకు 25000 క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 1013 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తికి 33,549 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా సాగర్‌కు 3,50,511 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయం పూర్తి నీటిమట్టం 885 అడుగులు. కాగా ప్రస్తుతం జలాశయంలో 883 అడుగుల నీరు ఉంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.28 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**విశాలాంధ్ర-కర్నూలు సిటీ :** చెత్త నుండి బయో గ్యాస్ తయారు చేసే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం స్వచ్ఛంద్ర కార్పొరేషన్, నగరపాలక ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కమిషనర్ గార్గేపురం డంప్‌యార్డులో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏటా టన్నుల కొద్దీ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండటంతో భూమి కలుషితమై పోతుందని, ఈ సమస్యకు పరిష్కారంగా సిబిజి ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పేర్కొన్నారు. దీని ద్వారా చెత్త నుండి సంపద సృష్టి అలాగే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. సిబిజి ప్లాంట్ నిర్మాణానికి 10 ఎకరాల భూమి అవసరం అవుతుందని, అక్కడ బయో గ్యాస్ తయారు చేసి వాహనాలకు నింపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈ షాకీర్, డిసిపి సంధ్య, డిఈఈ నరేశ్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరుకుంద ఈరన్న హుండీ లెక్కింపు

**విశాలాంధ్ర-కౌతాళం:** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీ ఉరుకుంద ఈరన్న హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మొదటివారం రూ.38 70,013ల నగదు వచ్చినట్లు 6.600 కేజీల వెండి వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ఈ శ్రావణ మాస ఉత్సవాలలో ఆలయ అభివృద్ధికి, నిత్యాన్నదానానికి, విరాళాలు ఇచ్చువారు కార్యాలయమునకు వచ్చి విరాళాలు ఇచ్చిన తర్వాత తగు రసీదును పొందాలని భక్తులకు తెలిపార్చు.కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ అధికారి పాండురంగారెడ్డి, ఉండి పర్యవేక్షణాధికారి వెంకటేష్, పోలీస్ సిబ్బంది, ఆదోని భ్రమరంభ సేవా సమితి వారు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు శిక్షణ

**విశాలాంధ్ర-కల్లూరు:** ఏపిఎస్ఐ ఆర్‌డి మరియు ఆర్‌జిఎస్‌ఏ వారి మరియు ముఖ్య కార్య నిర్వహణాధికారి జిల్లా ప్రజా పరిషద్ కర్నూలు వారి ఆదేశాముల మేరకు అందరు సర్పంచులకు అందరు పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 1 నుండి గ్రేడ్ 5 వారికీ ఈనెల 12 నుండి 14 వరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కల్లూరు నందు జరుగును. భోజన వసతి మరియు రూ.100 సిట్టింగ్ అలవెన్సు ఇవ్వబడును.గ్రామ పంచాయతీ పరిపాలన నిర్వహణ, చెత్త సంపద, పొదుపు భాగస్వామ్యంతో పారిశుద్ధ్యం తాగునీరుపై 1994 చట్టం మొదలైన అన్ని అంశముల మీద శిక్షణ ఇవ్వబడును.కనుక అందరు సర్పంచులు అందరు పంచాయతీ కార్యదర్శులు మండలం ప్రజా పరిషద్ కల్లూరుకు మూడు దినములు హాజరుకావలెనుని ఎంపీడీఓ తెలిపారు.

### మూడు టిప్పర్లతో పాటు ట్రాక్టర్ సీజ్




**విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు :** నగర శివారుల్లోని రింగు రోడ్డు దగ్గర అక్రమంగా మెటల్ రవాణా చేస్తున్న మూడు టిప్పర్లతో పాటుగా ఇసుక ట్రాక్టర్ ను శుక్రవారం దాడిచేసి సీజ్ చేసి రూ.55 వేల అపరాధ రుసుము వసూలు చేయడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ విలేకరులకు తెలిపారు.రాయల్టీ ఇన్స్పెక్టర్ నరహరి సిబ్బంది పాల్గొన్నారు

### బంటన హాల్‌కు బస్సు సర్వీస్ కల్పించాలంటూ వినతి



**విశాలాంధ్ర-చిప్పగిరి:** మండల పరిధిలోని బంటనహాళ్ గ్రామానికి ఆర్టీసీ బస్సుసర్వీస్‌ను కల్పించాలంటూ గుంతకల్ డిపో మేనేజర్‌కు బంటన హాల్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆ గ్రామస్తులు మా గ్రామానికి బస్సు సర్వీస్ లేకపోవడంతో గ్రామం నుండి బయటకు రావాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆటోలు ద్వారా, ద్విచక్ర వాహనాలు ద్వారా మండల కేంద్రమైన చిప్పగిరికి ఏ చిన్న పని పడిన గుంటకల్లుకు రావాల్సిందేనని బంటనహాళ్ గ్రామమునకు రోడ్డు వేశారు కానీ ఆర్టీసీ బస్సు సర్వీస్ మాత్రం కల్పించలేకపోయారని దీంతో గ్రామములోనే చదువుకునే విద్యార్థి విద్యార్థినీలు మధ్యలోనే చదువులను ఆపేయవలసి వస్తుందని గ్రామస్తులు వాపోయారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ కల్పిస్తే గ్రామము అభివృద్ధి చెందుతుందని చదువుకునే విద్యావంతులకు పై చదువులు చదువుకునేందుకు వీలు పడుతుందన్నారు. కనుక గ్రామానికి ఆర్టీసీ బస్ సర్వీస్ కల్పించాలని గుంటకల్ ఆర్టీసీ డిపో మేనేజర్ వినత పత్రం ద్వారా తెలియజేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

# పండ్లు తోటలపెంపకంతోనే రైతుల అభివృద్ధి



**విశాలాంధ్ర-చిప్పగిరి:** పండ్లు తోటలతోనే రైతులు అభివృద్ధి చెందుతారని మండల ఉపాధి హామీ పథకం ఏపీవో మాధవ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిప్పగిరిలో ఉపాధి హామీ పథకం ద్వారా హార్టికల్చర్ కింద మంజూరు అయిన పండ్ల మొక్కల పెంపకాన్ని ఏపీవో మాధవ శంకర్,హార్టికల్చర్ అధికారులు రైతుల తోటల్లో నాటిన పండ్ల మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ల అభివృద్ధి కొరకు జాతీయ ఉపాధి హామీ పథ కం ద్వారా పండ్లు మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు పండ్లు మొక్కల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పండ్లు మొక్కల పెంపకంపై మక్కువ చూపిస్తే మంచి దిగుబడులు అందిస్తాయని రైతులకు పండ్లు తోటలపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించడం జరుగుతుందని ఏ సమస్య వచ్చిన సంబంధిత హార్టికల్చర్ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర-సి.బెళగల్:** మండల పరిధిలోని బురాన్ దొడ్డిలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించి అనంతరం రైతు భరోసా కేంద్ర ఇన్చార్జితో కలిసి కృష్ణ దొడ్డి,ప్యాతోలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి-కంది పంటలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు.ఆయన మాటాడుతూ పత్తి పంటలో తెల్లదోమ నివారణకు ఎలాంటి మందులు వినియోగించాలన్న దానిపై వివరించారు.కందిపంటలో శనగపచ్చ పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను రైతులకు వివరించారు.

## మత్తుతో భవిష్యత్తు చిత్తు

**విశాలాంధ్ర-కర్నూలు సిటీ:** విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలసిన తరుణంలో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు చిత్తై బంగారం లాంటి బతుకు బూడిద కన్నా హీనమవుతుందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కె.వెంకట రమణయ్య అన్నారు.మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలలో కల్చరల్ అండ్ లిటరరీ ఆక్టివిటీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె. వెంకట రమణయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, పొగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకంతో యువత వ్యాధుల బారినపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, నూతన చట్టాలు తదితర అంశాలపై ఆయన వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శాంత మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ఏటా లక్షల మంది ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని, వారిలో యువత సంఖ్య అధికంగా ఉందని అన్నారు. ఆరోగ్యకర అలవాట్లతో పాటు యోగా, వ్యాయామంను దైనందిన జీవితంలో భాగంగా చేర్చుకోవడం ద్వారా యువత సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటాటరని ఆమె సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలు, మత్తు, పొగాకు ఉత్పత్తుల నిర్మూలనపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆశాపర్వీన్, సభ్యులు వాసవి, విద్యుల్లత, విద్యార్థులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల సంక్షేమానికికృషి- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

**విశాలాంధ్ర-బళ్లారి చౌరస్తా:** మత్స్యకారుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బంగారుపేటలో జిల్లా మత్స్యకార సహకార సంఘ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బైరెడ్డి మాట్లాడుతూ సమస్యలను చర్చించి పరిష్కరించుకునేందుకు మత్స్యకారులు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మత్స్యకారుల సమస్యలను సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళేందుకు ఈ వేదిక దోహదపడుతుందని చెప్పారు. జిల్లా మత్స్యకార సహకారసంఘం చైర్మన్ నవీన్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకార సహకార సంఘాల నుంచి వచ్చే సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. అవకాశాన్ని మత్స్యకార సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు శ్రీనివాసులు ,వైస్ చైర్మన్ టి.పెద్ద వీరేష్, డైరెక్టర్లు శేఖర్, భాస్కర్, మల్లిశ్వరుడు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నగేష్, అడ్వకేట్ శ్రీనివాసులు, పాలూరి శివ, ఎద్దుల వెంకటేష్, రామస్వామి పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా నినాదంతోనే మనకు స్వాతంత్ర్యం

**విశాలాంధ్ర-జిల్లాపరిషత్తు :** క్విట్ ఇండియా నినాదంతోనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె బాబురావు స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 83వ క్విట్ ఇండియా దినోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించి కార్యకర్తల సమావేశంలో కార్యకర్తల నుద్దేశించి ప్రసంగించారు. 1942 జూన్‌లో మహారాష్ట్రలోని ముంబై నగరం వార్ధా ప్రాంతంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించగా సర్దార్ వల్లభాయ్ పటేల్ తీర్మానాన్ని బలపరచారన్నారు.భారతదేశంలో వదిలి వెళ్ళండి అని 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఆంగ్లేయులకు అల్టిమేటం ఇచ్చాడని గాంధీజీ పిలుపు మేరకు మరుసటి రోజు ఆగస్టు 9న క్విట్ ఇండియా అంటూ లక్షలాదిమంది కాంగ్రెస్ శ్రేణులు ప్రజలు నినాదాలతో రోడ్ల పైకి వచ్చారన్నారు. అదే క్విట్‌ఇండియా ఉద్యమంగా పేరుగాంచిందని ఆగస్టు 9న జరిగిన అఖిల భారత కాంగ్రెస్‌కమిటీ క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించడం జరిగిందని వివరించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి కొండారెడ్డి బురుజు వద్ద గల మహాత్మాగాంధీ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాబురావు పార్టీ పతాకం ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను రగిలించిన ఉద్యమం క్విట్ ఇండియా

**విశాలాంధ్ర-కర్నూలు సిటీ :** స్వాతంత్ర జాతీయ ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక కీలక ఘట్టంగా మిగిలిపోయిందని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. క్విట్ ఇండియా మూమెంట్ డే ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలదండ అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశంలో బ్రిటిష్ పాలనను అంతం చేయడానికి 'విజయమో వీర స్వర్గమో ' అన్న నినాదంతో పిలుపునిచ్చిన మహాత్మా గాంధీజీ ఆశయ సాధన దిశగా నేటి యువత దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు ,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 10, ఆగష్టు 2024

## ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ చేసిన మంత్రి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల టౌన్ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు డీఐఈవో సునీత, కాలేజీ ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప, ఉర్దూ గర్ల్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కరిముల్ల ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ బాలికల కళాశాల నందు నిర్వహించిన ఉచిత పాఠ్య పుస్తకాలు నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థినిలు బాగా చదువుకొని అన్ని రంగాలలో రాణించాలన్నారు. చదువు ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుస్తుందని, ప్రతి ఒక్కరు ఒక టార్గెట్‌ను పెట్టుకుని చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని కోరారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు మంచినీళ్లు సరిగ్గా రావడం లేదని మంత్రి ఫరూక్‌కు దృష్టికి తీసుకురాగా వెంటనే మున్సిపల్ కొళాయిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కంప్యూటర్, టైపింగ్ మిషన్ కావాలని కోరగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధ్యాపకుల బృందం మంత్రి ఫరూక్‌ను ఘనంగా సన్మానించారు.

## ఆదివాసీలకు మెరుగైన వైద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పత్తికొండ శాసనసభ్యులు కేఈ.శ్యామ్ బాబు, కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి తదితరులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదివాసిల దృష్టిలో ఉంచుకొని జెనీవాలో 1982వ సంవత్సరంలో అటవీ హక్కులకు సంబంధించిన నిపుణలతో ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని సదరు కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీన నిర్వహించు కోవడం జరుగుతుందన్నారు. ఈ రోజున ఆదివాసిలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించుకోవడంతో పాటు ఉన్న సమస్యలను చర్చించుకొని, ఆ సమస్యలపై చర్చించి వాటి సమస్యలపై పరిష్కారం కోసం ప్రభుత్వాలు పాలసీలు రూపొందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో సుమారుగా 8.83 శాతం ఆదివాసిలు ఉన్నారు. అదే విధంగా మన రాష్ట్రంలో సుమారు 5.53 శాతం ఉన్నారన్నారు. మన రాష్ట్రంలో 34 తెగల వరకు ఉంటారని, అందులో 11 ప్రత్యేక గిరిజన దుర్బల తెగలు ఉన్నాయన్నారు. గతంలో నేను ఒక మూడు సంవత్సరాల గిరిజన సంక్షేమ శాఖకు డైరెక్టర్ గా ఉండి వీరికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయడం జరిగిందన్నారు. గిరిజన సంఘాల నాయకులు గిరిజన విద్యార్థులకు డిఎస్సీ శిక్షణ కేంద్రం, తుగ్గలిలో వసతి గృహ సమస్యలు, తదితర సమస్యలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా ఉన్న సమయంలో గిరిజన సంఘాల నాయకులతో కలసి వసతి గృహాల్లో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయడం జరిగిందన్నారు. అందుకు జిల్లాలో ఉన్న అన్ని గిరిజన, బిసీ సంక్షేమ వసతి గృహాలకు పూర్తి స్థాయి మౌలిక సదు పాయాలు కల్పించేందు కు బిసీ సంక్షేమ వసతి గృహాలకు 9 కోట్లు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 5 కోట్లు, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు 2 కోట్ల వరకు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వీటిని సిఎస్ఆర్ నిధుల నుంచి కానీ, ప్రభుత్వానికి నుంచి కానీ నిధిలు తెప్పించుకొని త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆది వాసీలు, గిరిజన సంక్షేమ కోసం పోరాడిన బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, మల్లుదొర, గంటం దొర లాంటి నాయకులు మన స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల ఉన్నతికి కృషి చేయడంతో పేదరికంతో బాధపడుతున్న వారికి చేయూతను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో తను ఎప్పుడు అందుబాటులో ఉంటానని ఏవిధమైన సమస్య ఉన్న దృష్టికి తీసుకొని వస్తే కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మనం ఉన్నత స్థానాలకు ఎదగడంతో పాటు మన సమాజాన్ని ఉన్నతికి కృషి చేయడం వల్ల మన రాష్ట్రం, దేశం కూడా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు.అనంతరం పాణ్యం శాసన సభ్యులు గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఉంటున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గిరిజనులకు సంబంధించిన కులవృత్తులను ప్రోత్సహించడం వల్ల కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వాలు అందజేస్తున్న అన్ని పథకాలను కూడా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. పత్తికొండ శాసనసభ్యులు కేఈ.శ్యామ్ బాబు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో పత్తికొండలో ఉన్న 16-18 తాండాల్లో సిసి రోడ్లు, మంచినీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : సీఐ

విశాలాంధ్ర-పెద్దకడబూరు : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉక్కు పాదం మోపుతామని కోసిగి సీఐ మంజునాథ్ హెచ్చరించారు. కోసిగి సీఐగా బాధ్యతలు తీసుకున్న మంజునాథ్ శుక్రవారం మొదటిసారి పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్ ను సందర్శించారు. పోలీసు స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. ఇక్కడ పని చేస్తున్న పీఎస్ ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని సమస్యాత్మక గ్రామాల వివరాలను, మండలంలోని క్రైమ్ రేటు తీరు తెన్నులను ఎస్ఐ మహేష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సామరస్యంతో, శాంతియుతంగా జీవించడం అలవరచుకోవాలన్నారు.

### నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పెద్దకడబూరు : విజయవాడలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న శిలా ఫలకాలను ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు ముక్కరన్న, అర్లప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజ్, సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విజయవాడలో శిలా ఫలకాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ నాయకులు విగ్రహాల వద్ద ఉన్న శిలా ఫలకాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. జాతీయ నాయకుల విగ్రహాలపై రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. పార్టీల మధ్య రాజకీయాలు ఉండాలని, జాతీయ నాయకుల విగ్రహాలతో కాదని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి శిలా ఫలకాలను ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అనిల్, ఏసన్న, సుందరం, తుప్పటి హనుమన్న, ముగతి ఏసన్న, లోకయ్య పాల్గొన్నారు.

### భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

విశాలాంధ్ర-ఆదోని రూరల్: శ్రీ రణమండల ఆంజనేయ స్వామి శ్రావణ మాస ఉత్సవాలుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో తహసీల్దార్ శివ రాముడు తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి ఆదేశాల మేరకు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శివరాముడు మాట్లాడుతూ భక్తులు ఏంతో నిష్టగా జరుపుకునే శ్రావణమాస ఉత్సవాలలో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా శ్రీ రణమండల ఆంజనేయస్వామి దర్శనానంతరం భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఇబ్బందులు కలగని ప్రదేశంలో పార్కింగ్ ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు.శ్రీ రాణమండల ఆంజనేయ స్వామి శ్రావణమాస ఉత్సవాలను విజయవంతం చేసుకునేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య,మండల సర్వేయర్ రమణ, ఇంచార్జ్ ఈఓపీఆర్డీ నాగరాజ్ వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి



విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: ఈ నెల 10, 11 తేదీల్లో చిత్తూరు జిల్లా వి.కోట పట్టణంలో జరగబోయే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే కర్నూలు జట్లు శుక్రవారం రోజున బయలుదేరాయి. క్రీడాకారులకు అభినందనలు తెలియజేయడానికి జిల్లా ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విజేతలగా రాణించాలని తెలిపారు. రాష్ట్ర జట్టులోకి కూడా జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యేలా కృషి తెలిపారు. తనకు క్రీడలన్న క్రీడాకారులన్న ఎంతో ఇష్టమని, క్రీడాకారులకు ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని అర్హులైన క్రీడాకారులకు అన్ని విధాలుగా సాయం చేయడానికి ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, షూటింగ్ బాల్ కోచ్ మల్లికార్జున తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్ర, మధు, ప్రభాకర్ యాదవ్, దివాకర్, నాగేశ్వరి, అమృత, రాజేశ్వరి, సురేష్, రాహుల్, జాకీర్, సుభాన్ బాష, రవి, భాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర-కర్నూలు క్రైం : కర్నూలు నగరం, ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 7వ తేదీన వర్మ కాంపౌండ్‌లో జరిగిన వ్యక్తి హత్య కేసులో నిందితులను సిఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసినట్లు కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం డిఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఈ. తాండ్రపాడుకు కురువ శివుడు ఏ శివ (36) అనే వ్యక్తి ఓల్డ్ టౌన్ వద్ద వున్న వర్మ కాంపౌండ్ కు వాచ్ మెన్ గా ఉండేవాడని అన్నారు. అతనికి, ఏ1 నిందుతుడు షేక్ రఫీక్ భార్యతో వివాహేతర సంబంధం కలిగివున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కురువ శివుడుపై కక్ష పెంచుకున్న షేక్ రఫిక్, మరో ముగ్గురు స్నేహితులు తెలుగు బ్రహ్మం, తొట్టం పూరి భరత్,పింజరి మూర్తుజా వలిలను కలుపుకుని ఈ నెల 7వ తేదీన మృతుడిపై క్రికెట్ బ్యాట్‌లతో దాడి చేయడంతో వరమ శివుడు మృతి చెందినట్లు చెప్పారు. ఈ కేసులో ఒకటవ పోలీస్ స్టేషన్ సిఐ పవన్ కుమార్, సిబ్బందితో చేపట్టిన విచారణకు ప్రజలు సైతం సహకరించడం హర్షనీయం అన్నారు.ఈ సందర్భంగా అందిన సమాచారం మేరకు జొహరాపురం, కిమ్స్ హాస్పిటల్ పార్కింగ్ వద్ద సీఐ పవన్ కుమార్, నిందితులను అరెస్ట్ చేసి, జేఎఫ్‌సీఎం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసులో పురోగతి సాధించిన సీఐ వై.పవన్ కుమార్,వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినదించినట్లు తెలిపారు.

### ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకట నరసింహులు

విశాలాంధ్ర-ఆలూరు: సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో పని చేసిన ఓబులేసు బదిలీపై వెళ్లిపోవడంతో ఇంకా ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పనిచేస్తున్న, శుక్రవారం ఆలూరు పోలీస్ స్టేషన్లో కార్యాలయంలో ఎస్సై వెంకట నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సై బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని, మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణ ధ్యేయంగా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లవేళ అందుబాటులో ఉంటామని తెలిపారు. మహిళ రక్షణ, భద్రత నేరలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక నిగా పెడతామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో కలిసి పని చేస్తామని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర -గోనెగండ్ల: నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి సుధాకర్ రావు తెలిపారు. శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

### సీజనల్ వ్యాధులు నిర్మూలనకు చర్యలు

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుందలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ అన్నారు. శుక్ర వారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఉన్న చెత్తా చెదారాన్ని, ముళ్ళ కంపలను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్‌ను వేసి దోమల లార్వా నిర్మూలన మందును చల్లారు గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపించకుండా ట్రాక్టర్, ఆటో ద్వారా పారిశుద్యాన్ని ఎత్తివేస్తున్నామన్నారు.

### పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

విశాలాంధ్ర-కౌతాళం రూరల్: రైతులు తమ పంట పొలాలను వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏ డి ఏ అరుణకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాల అమలును పరిశీలించారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులు ఏఏ పంటలు సాగు చేస్తారో నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకొని తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేసి చేసుకోవాలని సూచించారు. ముందుగా గ్రామంలోని పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శేషాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

### ఈ-పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర-ఆదోని రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్ద తుంబలం, గనేకల్, జాలబెంచి, దొడ్డనకేరి, కపటి గ్రామాలలో సాగు చేసిన పంట పొలాలకు ఈ-క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ-క్రాప్ పంట నమోదు చేసుకున్నట్లయితే వ్యవసాయానికి సంబంధించిన వివిధ రకాల ప్రభుత్వ రాయితీలు, ఇన్సూరెన్స్, వచ్చిన దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ఈ-క్రాఫ్ట్ నమోదు ఎంతగానో అవసరమవుతుందన్నారు.ఈ-క్రాప్ నమోదు పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఏడాది సాగుచేసిన పంట పొలన్ని ఈ క్రాప్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు కేంద్రాల్లో గ్రామీణ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు మరియు బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ రైతులు తీసుకువెళ్లి ఇవ్వాలని తెలియజేశారు. సాగు చేసిన పంట పొలాలను పర్యవేక్షించిన అనంతరం రైతులకు సాగుపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వేప గింజల కషాయం తయారీ విధానం వివరిస్తూ, పంట పొలాలకు వాడే విధానం కలిగించే లాభాల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మానసిక వికాసానికి పెద్ద పీట వేయాలి : వైస్ ఛాన్సలర్

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలో విద్యతో పాటు విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి పెద్ద పీట వేయాలని విశ్వ విద్యాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్‌టి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం విసీ కాన్ఫరెన్స్ హాల్లో వైస్ ఛాన్సలర్ అధ్యక్షతన యూనివర్సిటీ స్పోర్ట్స్ అడ్వైజర్ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో వచ్చే విద్యా సంవత్సరం యూనివర్సిటీ పరిధిలో చేపట్టాలని క్రీడా కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులతో ఆయన విస్తృతంగా చర్చించారు. గడిచిన విద్యా సంవత్సరంలో రాయలసీమ విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్ కళాశాల, అంతర్వేద్యాలయాల పోటీల నిర్వహణకు సహకరించిన కళాశాల యజమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే 2024-25 విద్యా సంవత్సరం సంబంధించి స్పోర్ట్స్ క్యాలెండర్ ను గురించి నిర్వహించాల్సిన క్రీడా పోటీలు వేదికల గురించి చర్చించారు అలాగే వివిధ స్థాయిలో జరిగే చూడాల్సిందిగా కళాశాల యజమానులకు ఆయన సూచించారు. వివిధ పోటీల్లో యూనివర్సిటీ తరపున పాల్గొని విద్యార్థులు అంతా ఒకే రకమైన యూనిఫామ్ ధరించే విధంగా చూడాల్సిందిగా కళాశాల యజమానులకు ఆయన సూచించారు. వివిధ పోటీల్లో పాల్గొనే విద్యా ర్థులు వయోపరిమితి 17 ఏళ్ల నుంచి 25 ఏఐయువారు నిర్దేశించిన ప్రమాణాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివ కిషోర్, ప్రభుత్వ బీడీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవి కళ్యాణ్ కుమార్, నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల నుండి హేమంత్ రెడ్డి, ఆదోని ఆర్ సెండ్ సైన్స్ కళాశాల నుండి డాక్టర్ కంబిరెడ్డి, డాక్టర్ ఎర్రి స్వామి పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో సేవ్ ఇండియా సేవా అగ్రికల్చర్

విశాలాంధ్ర - నంద్యాల : మోడీ కేంద్ర ప్రభుత్వ రైతాంగ విధానాలపై పిలుపులో భాగంగా కిసాన్ సంఘ్ మార్చ్ పిలుపులో భాగంగా స్థానిక బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, అధ్యక్షత వహించగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్, సిపిఎంఎల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ పాల్గొని మాట్లాడడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ప్రబల నిదర్శనమని, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేసిందని, విశాల దేశ ప్రయోజనాలను విస్మరించిందని ఆరోపించారు. బడ్జెట్ ప్రతిపాదనలో మౌలిక రంగాలను నిర్లక్ష్యం చేశారని, సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి ఎటువంటి ఊతం లభించలేదన్నారు. సంపద ఉత్పత్తికి ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్న కార్మిక వర్గాన్ని విస్మరించారని, ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక, మహిళా వ్యతిరేక, యువజన విద్యార్థి వ్యతిరేక, కార్పొరేట్ బడ్జెట్ వర్గాల ఆశలకు అనుకూలమైన బడ్జెట్ గా అనేకమంది ఆర్థిక వేతలు ఈ బడ్జెను పేర్కొన్నారన్నారు. అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో వండి వార్చిన బడ్జెట్ ఇదని విమర్శించారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని కోరారు. దేశ సహజ సంపద ప్రకృతి వనరులు పంచభూతాలపై హక్కు ప్రజలదేనని, కార్పొరేట్లకు అప్పనంగా బకాయిలు రద్దుకు ఇచ్చిన రూ.15 లక్షల కోట్లు తిరిగి వసూలు చేసి, రైతాంగం కార్మిక సంక్షేమానికి వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాసులు, భూమని శ్రీనివాసులు, వెంకటలింగం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మార్కు తదితరులు పాల్గొన్నారు.

### యువకుడిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర - హొళగుంద : బాపట్ల జిల్లాలోని ఈపురుపాలెంలో ముస్లిం యువకుడిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హొళగుంద ముస్లిం మైనారిటీ నాయకులు కే జాకీర్ డిమాండ్ చేశారు. హొళగుందలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారుకు తన సైకిల్లో అడ్డంగా పెట్టి తీయలేదనే చిన్న కారణం చేత ఓ ముస్లిం మైనారిటీ యువకుడిని హత్య చేసిన సంఘటన బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో జరగటం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. యువకుడిని అకారణంగా హత్య చేసిన వారిని వెంటనే శిక్షించి వారి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ,రాష్ట్ర హోం శాఖ మంత్రి స్పందించి ఈ ఘటనపై దర్యాప్తు చేసి దుండగులకు కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు మోయిన్, అతహు రహిమాన్, ఆమాన్, సుభాన్, రాంపురం బషీర్, ముస్లిం మత పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

విశాలాంధ్ర-గోనెగండ్ల: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మిన్నల్లా (50) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన మిన్నాల్లా హోటల్ పెట్టుకోని జీవనం సాగించేవాడు.గత 5 ఏళ్ల క్రితం ఎకరా భూమి అమ్ముకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు పెళ్లి అప్పులు చేసుకున్నాడు. ఈయనకు భార్యా అశబీ ఉంది. ఆర్థిక ఇబ్బందులు వల్ల శుక్రవారం మధ్యాహ్నం గాజులదిన్నె కాలువ గట్టు పక్కన ఎవరులేని సమయంలో మిన్నల్లా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చుట్టూ పక్కల రైతులు పోలీసులకు తెలిపారు. సీఐ గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నూతన సీఐగా మస్తాన్‌వలి

విశాలాంధ్ర-ఆస్పరి : ఆస్పరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా శుక్రవారం మస్తాన్ వలి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న హనుమంతప్ప బదిలీపై చిత్తూరు జిల్లాలోని ఎస్ఆర్ నగర్ సర్కిల్ స్టేషన్‌కు వెళ్లారన్నారు. మస్తాన్ వలి ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికలలో భాగంగా తిరుపతిలోని భాకరాపేట సర్కిల్ పోలీస్ స్టేషన్ సీఐగా ప్రమోషన్ తో బదిలీపై వెళ్లడం జరిగింది. అక్కడి నుండి ఆస్పరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా మస్తాన్ వలి బదిలీపై రావడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మస్తాన్ వలి మాట్లాడుతూ గతంలో మద్దికేర,ఆదోని వన్ టౌన్, టు టౌన్, చిప్పగిరిలో పని చేశాన్నన్నారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది కలిగించిన, భయభ్రాంతులకు గురిచేసిన సహించేది లేదన్నారు. నాటు సారా, కర్ణాటక మద్యం, బెల్ట్ షాపులు నిర్వహింస్తునట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు సమస్యతో వచ్చిన బాధితులకు ఆ సమస్య ఎంత పెద్దదైన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

### మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ పీజీ మూడవ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు వైస్ ఛాన్సలర్ ఎన్‌టీ నాయక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు ఫిబ్రవరిలో జరిగిన ఫలితాలను విడుదల చేశారు. రెగ్యులర్ 96 గాను 82 మంది విద్యార్థిని విద్యార్థులు పాస్ కాగా, 85.42 పర్సెంటేజీ వచ్చినట్లు వారు తెలిపారు. సప్లిమెంటరీ 93 గాను 63 మంది విద్యార్థులు పాస్ అయినట్లు వారు తెలిపారు 67.74శాతం వచ్చినట్లు తెలిపారు.

### రెండు తాండా గ్రామాల్లో వైద్య శిబిరం

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.కబర్ధి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కొల్లంపల్లి తాండ, ఓబులాపురం తాండ నందు వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా, డెంగ్యు, రక్తహీనత, సుగర్ టెస్ట్, స్కానింగ్ టెస్ట్‌లను నిర్వహించి లోపము ఉన్నవారికి మాత్రలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 300 సుగాలీలు లబ్ధి పొందారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎల్.భాస్కర్ సహాయ సహకారాలతో వైద్య శిబిరం లను నిర్వహించడమైనది. ఉల్లింద కొండ పోలీసు స్టేషన్ ఏఎస్ఐలు, వైద్యులు ఎం.రఘు, ఆనంద్, వైద్య సిబ్బంధి, ఆశా వర్కర్ దానమ్మ బాయి తదితరులు పాల్గొన్నారు.